

## పూడిచెర్ల కొండకు 'గుండు'

నన్నూరు సమీపంలోని పూడిచెర్లలో టీడీపీ నేతలు మూడు రోజులుగా అక్రమ మైనింగ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా కొండను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. ...8లో▸



## ఉప్పొంగిన భక్తిభావం

శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండో సోమవారం ఉరుకుంద క్షేత్రానికి రెండు లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ దారులన్నీ కిటకిటలాడాయి. ..8లో▸



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,626 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :85 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :25,571 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :99,567 |

## న్యూస్‌రీల్

### నాగాభరణం విరాళం



వెండి నాగాభరణాన్ని విరాళంగా అందజేస్తున్న దాత

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల దేవస్థానానికి ఒంగోలుకు చెందిన టి.శ్రీనివాసరావు 3.150 కిలోల వెండి నాగాభరణాన్ని సోమవారం విరాళంగా అందించారు. ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు నాగాభరణాన్ని వేద పండితులు గంటి రాధాకృష్ణ అవధాని, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునకు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు వేదాశీర్వచనంతో పాటు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

### బాల కార్మికులను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

**నంద్యాల(అర్బన్):** బాల కార్మికులను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలో ఉన్న పరిశ్రమలు, హోటళ్లు చెంచు గూడెంలు, ఇతర కర్మాగారాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించాలని టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులకు సూచించారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలందరినీ పనిలో పెట్టకుండా పాఠశాలకు పంపేలా చైతన్యం కలిగించాలన్నారు. టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాలు మొక్కుబడి రీతిలో నిర్వహిస్తూ కాగితాలకే పరిమితం కాకూడదన్నారు. క్షేత్రస్థాయిలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, హోటళ్లు, దుకాణాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారద, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు నాయక్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీశ్ చంద్ర రెడ్డి, డాక్టర్ సునీత, డీఈఓ సుధాకర్ రెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కేసీ కాల్వకు 2,400 క్యూసెక్కులు



కేసీ కాల్వలో నీటి ప్రవాహం

**జూపాడుబంగ్లా:** సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం ఏఈ రాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల డ్యాంలోకి 30,117 క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతుండగా డ్యాంలో 1.2 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు తెలిపారు. 2,400 క్యూసెక్కులు కేసీ కాల్వకు సరఫరా చేస్తుండగా మిగిలిన నీటిని తుంగభద్రనది దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. డ్యాం నుంచి కాల్వలోకి సరఫరా చేసిన నీళ్లు ఆయకట్టు రైతుల వినియోగించుకున్న అనంతరం లాకిన్స్‌లా వరకు 1,783 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతున్నట్లు లాకిన్స్‌లా ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. అక్కడి నుంచి 1,408 క్యూసెక్కులు నిప్పులవాగుకు, 170 క్యూసెక్కులు ఏబీఆర్ కాల్వకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

### ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

**బొమ్మలసత్రం:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి 110 ఫిర్యాదులు ఎస్పీకి అందాయి. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలను వెంటనే అక్కడికక్కడే పరిష్కరించామని, చట్టపరిధిలో లేని సమస్యలను ఆయా స్టేషన్ అధికారులు విచారించి పరిష్కారం చూపాలని ఆదేశించామన్నారు. లేదంటే కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. ఫిర్యాదులు తిరిగి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్జీదారుల నుంచి అధికంగా సివిల్ తగాదాలు, అత్తింటి వేధింపులు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రవీంద్రనాథ్ రెడ్డి, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### అవ్వకు సరుకులు ఎట్లా అందేది..

☛ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సుజాతమ్మ. ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరివెళ్ల మండలం వెంకటేశ్వరపురం గ్రామం. బంధువులు ఉన్నా ఒంటరిగా జీవిస్తోంది. దూరాన ఉన్న రేషన్ షాపునకు వెళ్లలేని పరిస్థితి. వయస్సు మీదపడటంతో ఇంటికే పరిమితమైంది. ఇప్పటి వరకు ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం ఇంటికే రావడంతో అతికష్టం మీద వండుకుని తినేది. చంద్రబాబు నిర్ణయం తెలుసుకుని సరుకులు ఎట్లా తెచ్చుకోవాలని



ఆందోళన చెందుతోంది. రేషన్ బండి తీస్తే మాలాంటి ముసలోళ్ల పరిస్థితి ఎట్లా అంటూ ప్రశ్నిస్తోంది.

### మళ్లీ ముద్దవరం పోవాల్సిందే

☛ ఈ చిత్రంలో కనిపిస్తున్న గ్రామం పేరు వీరాయపల్లె. బేతంచెర్ల మండల పరిధిలోని ముద్దవరం గ్రామ పంచాయతీకి మజరా గ్రామం. ఈ గ్రామంలో 70 కుటుంబాలు నివాసముంటున్నాయి. అందరూ వ్యవసాయం పైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ఐదేళ్ల క్రితం రేషన్ సరుకుల కోసం 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న ముద్దవరం గ్రామానికి వెళ్లాల్సి వచ్చేది. నిత్యావసర సరుకుల కోసం పనులు మానుకోవాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో



ఎండీయూ వాహనాలు రావడంతో ప్రజలకు రేషన్ కష్టాలు తొలగాయి. అయితే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలు తీసేస్తుండటంతో మళ్లీ ముద్దవరం పోవాల్సిందేనని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు.

# బాబు తీరు.. చౌకబారు!

- రేషన్ బండిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- చౌక దుకాణాల వద్ద ఇక పడిగాపులే
- మజరా గ్రామస్తులకు తప్పని అవస్థలు
- జిల్లాలో 5,41,804 రేషన్ కార్డుదారులు
- 351 ఎండీయూ వాహనాల పరిస్థితి ప్రశ్నార్థకం
- ప్రభుత్వ తీరుపై కార్డుదారుల ఆగ్రహం

**నంద్యాల(అర్బన్):** ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకం దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటే.. కూటమి ప్రభుత్వానికి మాత్రం వృథా పథకంగా కనిపించడం విస్మయాన్ని కలిగిస్తోంది. పేదలకు ప్రభుత్వ సేవలను దరి చేర్చాలనే సంకల్పంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే సచివాలయ వ్యవస్థతో పాటు ఇంటింటికీ పింఛన్లు, రేషన్ పంపిణీని చేపట్టారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రజా పంపిణీలో నవశకానికి నాంది పలికారు. ఈ పథకం దేశం మొత్తాన్ని ఆకర్షించింది. పేదలకు ప్రభుత్వం నుంచి సేవ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రూపొందించిన పథకం గడిచిన నాలుగేళ్లుగా విజయవంతంగా అమలు చేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేశారు. ఎంతో ప్రజాదరణ పొందిన ఈ పథకాన్ని తొలగిస్తుండటంతో ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 5,41,804 మంది రేషన్‌కార్డు దారులకు దాదాపు నెలలో 7640 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు ఇతర సరుకులు 351 ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ జరుగుతుంది. ఇంటర్నెట్ అందుబాటులో లేకపోయినా, సర్వర్లు పని చేయకపోయినా ఇంటి వద్ద యజమాని లేకపోయినా వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ ఓర్పు, సహనంతో ఎండీయూ ఆపరేటర్లు బియ్యం లోడ్ వాహనాలతో ఆయా కార్డుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నిజాయితీగా బియ్యం అందజేస్తూ వస్తున్నారు. తూకంలో ఏ విధమైన లోపం లేకుండా బియ్యం వారి ముందే తూకం వేసి అప్పగిస్తున్నారు. ఉచిత బియ్యం అయినప్పటికీ ఒక గింజ తేడా లేకుండా ఎండీయూల ద్వారా పంపిణీ జరిగింది. ఎండీయూల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ చేయిస్తూనే జిల్లాలోని 1,204 రేషన్ షాపుల ద్వారా రేషన్ బియ్యాన్ని ఆయా డీలర్ల నుంచి ఎండీయూలకు చేరవేసే పద్ధతిని కొనసాగించారు. ఐదేళ్ల క్రితం రేషన్ పంపిణీ ప్రతి నెలా 75 శాతానికి మించేది కాదు. ఎండీయూ వాహనాల ద్వారా 95 శాతానికి చేరుకునేది. కోవిడ్ సమయంలో ఇంటింటికి రేషన్ సరుకుల పంపిణీ ఎంతగానో ఉపయోగపడింది. ఆ సమయంలో రేషన్ సరుకులే నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలిచాయి. పారదర్శకంగా సరుకులు పంపిణీ చేసేందుకు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి ఎలక్ట్రానిక్ కాటాలోనే సరుకులను తూకం వేసి అందజేశారు.



ఎండీయూ వాహనాలే ఉండాలంటూ సంఘీభావం తెలుపుతున్న నంద్యాల కార్డు దారులు



### జిల్లాలో రేషన్ పంపిణీ వివరాలు

| నియోజకవర్గం | చౌక దుకాణాలు | ఎండీయూ వాహనాలు | కార్డులు |
|---|---|---|---|
| ఆళ్లగడ్డ | 217 | 55 | 92,526 |
| శ్రీశైలం | 173 | 50 | 74,196 |
| బనగానపల్లె | 209 | 56 | 89,966 |
| నంద్యాల | 173 | 57 | 84,428 |
| డోన్ | 171 | 58 | 86,480 |
| నందికొట్కూరు | 197 | 57 | 85,375 |
| పాణ్యం | 64 | 18 | 28,833 |
| మొత్తం | 1,204 | 351 | 5,41,804 |

### ఆందోళనలో ఎండీయూ ఆపరేటర్లు..



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించడంతో ఎండీయూ వాహన ఆపరేటర్లు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో 351 వాహనాలకు సంబంధించి ఒక్కో వాహనానికి ఓ ఆపరేటర్, సహాయకుడు కలిపి మొత్తం 702 మంది పైగాకి పైగా కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. నాలుగేళ్ల సేవలు అనంతరం పథకాన్ని నిర్వీర్యం చేయడమే కాకుండా తమ జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ కార్డుదారులకు అండగా ఉన్న తమకు ఈ విధమైన పరిస్థితి తేవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### ఒప్పందం మాటేంటి..?

ఇంటింటికి రేషన్ సరుకుల పంపిణీలో భాగంగా ఎండీయూ నిర్వాహకులకు అప్పటి ప్రభుత్వం 2027 వరకు ఒప్పందం ఉంది. వాహనాల వాయిదాలు సైతం అప్పటి వరకు చెల్లించాల్సి ఉంది. రూ.5.80 లక్షల విలువైన ఎండీయూ వాహనాలన్నీ గత ప్రభుత్వం ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాన్ని కల్పించింది. వాహన వ్యయంలో 10 శాతం లబ్ధిదారుడు చెల్లించగా మిగిలినది ప్రభుత్వం చెల్లిస్తోంది. లబ్ధిదారుడు నెలకు రూ.3 వేలు చెల్లిస్తుండగా మిగిలిన రూ.8వేలు ప్రభుత్వం బ్యాంకులకు జమ చేస్తోంది. పథకాన్ని రద్దు చేస్తే ఈ ఒప్పందాన్ని ఏమి చేస్తారని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధమని హెచ్చరిస్తున్నారు. ఎండీయూ పథకం దేశానికే ఆదర్శంగా ఉంటే రాష్ట్రంలో తూట్లు పొడిచే దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచనలు చేయడం పట్ల కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 15 కి.మీ వెళ్లాల్సిందే



మా గ్రామానికి రేషన్ దుకాణం లేదు. మా పెద్దల కాలం నుంచి మా గ్రామస్తులమంతా కొండ దారుల్లో దాదాపు 15 కిలోమీటర్ల దూరం ఉన్న కునుకుంట్లకి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఇలాంటి పరిస్థితి ఉన్న సమయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేషన్ పంపిణీ వాహనాలతో మా ఇబ్బందులు తొలగిపోయాయి. మా ఊరిలో మా ఇంటి వద్దకే వాహనాలు వచ్చి రేషన్ సరుకులను పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఈ వాహనాలను తొలగిస్తే మళ్లీ మేము ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కోవాల్సిందే.

– ముడావత్ కంబగిరి రాముడు నాయక్, మర్రికుంట తండా గ్రామం, అవుకు మండలం

### ఉపాధి పోతే ఎట్లా బతికేది



నాకు ముగ్గురు పిల్లలు. నేను ఐటీఐ మోటర్ మెకానిక్ చదివాను. ఎండీయూ ఆపరేటర్‌గా పని చేసుకుంటూ జీవిస్తున్నాను. నాకు మండలంలోని రుద్రవరం, జూటూరు, కోల్స్ ఆనందాపురం గ్రామాలు కేటాయించారు. ఈ గ్రామాలకు ప్రభుత్వ రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నాను. నాకు ప్రభుత్వం ఇచ్చే జీతంతోనే నా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నా భార్య ప్రతి రోజు వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంది. ఎండీయూ బండి రద్దు చేస్తే జీవనోపాధి కోల్పోతాను. భార్యా పిల్లలను వదిలి నేను ఉపాధి కోసం వలస వెళ్లాల్సిందే.

– రాజేష్, యర్రగుడూరు, పాములపాడు మండలం

### మాలాంటోళ్లు ఎలా తెచ్చుకోవాలి



ఇంటింటికీ రేషన్ పథకం చాలా మంచిది. ఇప్పుడు రేషన్ బండ్లను తొలగిస్తే నాలా..కాళ్లు లేనోళ్లు, కళ్లు లేనోళ్లు, నడవడానికి చేతకాని ముసలి వాళ్ల పరిస్థితి ఎలా? నా భార్య ఉదయాన్నే పనులకు వెళ్తుంది. ఆమె పనికి వెళ్తేనే మా కుటుంబం గడిచేది. ఇప్పుడు చౌక దుకాణం వద్దకు వెళ్లి క్యూలో ఎలా నిలవాలి. గతంలో డీలర్లు రేపు.. మాపు అంటూ తిప్పుకునేవారు. సరైన తూకం ఉండేది కాదు. చంద్రబాబు నాయుడు మళ్లీ అలాంటి పరిస్థితి తెచ్చి ప్రజలను కష్టాల పాలుజేస్తున్నారు.

– రాము, సున్నిపెంట

# శ్రీశైలం.. భక్తజన సంద్రం

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం భోళా శంకరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శించుకునేందుకు క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. సర్వ దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో, ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడాయి.

**16న సామూహిక వరలక్ష్మీ వ్రతం**

ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగా శ్రీశైల దేవస్థానం శ్రావణ రెండవ శుక్రవారం ఈ నెల 16న, నాల్గవ శుక్రవారం ఈ నెల 30న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనుంది. రెండవ శుక్రవారం ఉచిత సామూహిక వ్రతంలో పాల్గొనదలచిన ముత్తైదువులు ఈ నెల 15న సాయంత్రం 5గంటల లోపు దేవస్థాన ప్రచురణల విభాగంలో పేర్లను నమోదు చేసుకోవాలి. ఈ వ్రతంలో పాల్గొనేందుకు 1,500 మందికి దేవస్థానం అవకాశం కల్పించింది. తెల్లరేషన్ కార్డు కలిగిన వారు www. srisailadevasthanam. org ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఆలయ ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న చంద్రవతి కల్యాణమండపంలో నిర్వహించే వ్రతానికి కావాల్సిన పూజా ద్రవ్యాలను దేవస్థానం సమకూర్చనుంది.



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

**ఆర్జిత పరోక్షసేవగా..**

భక్తుల సౌకర్యార్థమై దేవస్థానం ఈ నెల 16న, ఈ నెల 30న పరోక్ష ఆర్జితసేవగా వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహిస్తుంది.పరోక్షసేవగా రూ.1,116 సేవా రుసుంను www. srisailadevasthanam. org ద్వారా చెల్లించి సేవ జరిపించుకునే అవకాశం కల్పించింది. భక్తులందరూ ఈ పరోక్షసేవను సద్వినియోగం చేసుకోవాలని దేవస్థాన ఈఓ పెద్దిరాజు సూచించారు.

# రెవెన్యూ సదస్సులు పకడ్బందీగా నిర్వహించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల(అర్బన్):** భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 15వ తేదీ నుంచి చేపట్టే రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సదస్సుల పరిశీలనకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించిందన్నారు. జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ సదస్సుల్లో ప్రధానంగా భూ ఆక్రమణలు, 22 ఎ భూముల అక్రమాలతో పాటు, పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులకు హాజరయ్యే రెవెన్యూ బృందాలు ఆర్‌ఓఆర్, అడంగల్, సంబంధిత రెవెన్యూ రికార్డులను వెంట తీసుకువెళ్లాలన్నారు. తీసుకున్న ప్రతి ఫిర్యాదుకు సంబంధిత అర్జీదారునికి రసీదు ఇవ్వాలన్నారు. తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, రిజిస్ట్రేషన్, ఫారెస్ట్, బ్యాంకర్లు సంబంధిత అధికారులను రెవెన్యూ సదస్సులలో భాగ స్వామ్యం చేయాలన్నారు. రైతులకు పంపిణీ చేసిన భూహక్కు పత్రాలను వెనక్కి తీసుకోవడంతో పాటు వాటి స్థానంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 15వ తేదీ న జిల్లాలో ఆరు అన్నా క్యాంటీన్లను కూడా ప్రారంభించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లు చేసు కోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్,డీఆర్‌ఓపద్మజ తదితరులు పాల్గొన్నారు.





వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

**చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి**

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థల్లోని 1 నుండి 19 ఏళ్ల విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలనపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో నులిపురుగుల నియంత్రణ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా విద్యార్థులు రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వాటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించేందుకు ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, సంక్షేమ వసతి గృహాల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 4,29,268 పిల్లలు ఉన్నట్లు గుర్తించారని, ఈ నెల 20న ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం తరువాత నమిలి మింగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భోజనం ముందు భోజనం తర్వాత విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు.

## నేటి నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

- అత్యవసర సేవలకు మినహాయింపు

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్లు ఈ నెల 13వ తేదీ నుంచి సమ్మె నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మకు సమ్మె నోటీసు అందజేశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ఆర్‌జీకేఆర్ మెడికల్ కాలేజీలో నైట్ డ్యూటీ నిర్వహించిన ఓ పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనకు నిరసనగా ఈ సమ్మె చేస్తున్నట్లు వారు ప్రకటించారు. సమ్మెలో అత్యవసర సేవలను మినహాయిస్తున్నట్లు వెల్లడించారు. పీజీ విద్యార్థిని మృతికి సంతాపంగా సోమవారం సాయంత్రం కళాశాలతో పాటు ఆసుపత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్లు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాజువాలిటీ ఎదుట నినాదాలు చేశారు. మృతి చెందిన పీజీ వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, దేశవ్యాప్తంగా పనిచేస్తున్న వైద్యులు, జూనియర్ డాక్టర్లకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



## కర్నూలులో 'మిస్టర్ బచ్చన్'

నగరంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో సోమవారం 'మిస్టర్ బచ్చన్ సినిమా' ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. మాస్ మహరాజ్ రవితేజ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే హాజరై సినిమాలోని నల్లంచు తెల్లచీర పాటకు స్టెప్పులేసి అభిమానులను ఉత్సాహపరిచారు. ఈ సినిమా 15న విడుదల చేస్తామని దర్శకులు హరీశ్ శంకర్ తెలిపారు. – కర్నూలు కల్చరల్

## నేటి నుంచి స్టాఫ్‌నర్సు అభ్యర్థులకు కౌన్సెలింగ్

**కర్నూలు(హాస్పిటల్):** స్టాఫ్‌నర్సు పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక జాబితాను తయారు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ వై.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితా, రోజువారీ కౌన్సెలింగ్ వివరాలను వెబ్‌సైట్ www.hmfw.ap.gov.inలో ఉంచామన్నారు. రోజుకు 50 మంది చొప్పున ఈ నెల 13, 14, 16, 17వ తేదీల్లో ఎంపికైన అభ్యర్థులకు కడపలోని ప్రాంతీయ వైద్య సంచాలకుల కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపిక జాబితాలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే 9440290777, 93819050378 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నంద్యాల(న్యూటౌన్):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలు – 2024 ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, ఏపీ రెసిడెన్షియల్, ఏపీ సోషల్ వెల్ఫేర్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయులు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నేరారోపణలు లేనటువంటి ఉపాధ్యాయులు మాత్రమే అవార్డులకు అర్హులన్నారు. నిర్ణీత నమూనాలో ఉపాధ్యాయులందరూ దరఖాస్తులను ఎంఈఓ, ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయానికి ఈనెల 23వ తేదీలోపు పంపాలన్నారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించబడవన్నారు. గతంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు పొందని వారు మాత్రమే అర్హులన్నారు. ఈ నెల 27వ తేదీలోగా వన్‌సెట్ ప్రతిపాదనలను డీఈఓ కార్యాలయానికి పంపాలన్నారు.

## క్లుప్తంగా

### ఓడీఎఫ్ ప్లస్‌గా 60 గ్రామ పంచాయతీలు


టి.నాగరాజు నాయుడు, డీపీఓ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని 60 గ్రామ పంచాయతీలను ఓడీఎఫ్ ప్లస్(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) గా తీర్చి దిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు చెప్పారు. ఇందుకు సంబంధించి జిల్లాకు అదనంగా 12వేల వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు. సోమవారం ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు మొత్తం 484 గ్రామ పంచాయతీల్లో 11 గ్రామ పంచాయతీలు బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా ఉన్నాయన్నారు. సర్పంచులు ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీసీ రోడ్డు వేసే సమయంలో తప్పనిసరిగా డ్రైన్లు నిర్మించిన అనంతరమే సీసీ రోడ్లు వేయాలన్నారు. జిల్లాలోని పది చిన్న గ్రామాల్లో సోలార్ ఆధారిత విద్యుదీకరణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలోనే ఒక గ్రామానికి సోలార్ ఆధారిత విద్యుదీకరణ చేసేందుకు ఎంత వ్యయం అవుతుందనే విషయంపై నెడ్‌క్యాప్ అధికారులతో మాట్లాడుతున్నామని డీపీఓ వివరించారు.

### నవోదయలో రోప్ స్కిప్పింగ్ పోటీలు


జ్యోతి ప్రజ్వల చేసి పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం ఇండియన్ రోప్ స్కిప్పింగ్ పోటీలను ప్రిన్సిపాల్ ఇ. పద్మావతి, సీఐ మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలోని 22 నవోదయ విద్యాలయాల నుంచి 141 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. రీజినల్ స్థాయిలో మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ప్రతిభ కనబరిచిన 30 మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బనవాసి విద్యాలయంలో 15 రోజుల పాటు శిక్షణ ఇస్తామని, శిక్షణ పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు కర్ణాటక రాష్ట్రం హసన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సీఐ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ టెక్నికల్ అధికారులు సాగర్, నిరంజన్, చంద్రశేకర్‌లు న్యాయ నిర్ణేతులుగా వ్యవహరిస్తున్నారు. వైస్ ప్రిన్సిపాల్ చంధీరన్, బసవరాజు, ఎర్రిస్వామి, శ్రీలక్ష్మీ, జగన్నాథ్, శిరిష, శ్రీనివాసరావు, వెంకటేష్, అంజలి, నబీ, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పోటీలో పాల్గొన్న విద్యార్థిని


అక్రమ తవ్వకాలతో రూపు కోల్పోయిన పూడిచెర్ల కొండ

# పూడిచెర్ల కొండకు 'గుండు'

**టీడీపీ శ్రేణుల అక్రమ మైనింగ్**
- యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ
- మూడు రోజులుగా కొనసాగుతున్నా పట్టని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

కర్నూలు(టౌన్): జిల్లా కేంద్రం కర్నూలు నుంచి 12 కిలోమీటర్ల దూరంలోని ఓర్వకల్లు మండలం నన్నూరు సమీపంలో ఉన్న పూడిచెర్ల గ్రామంలో టీడీపీ నేతలు మూడు రోజులుగా అక్రమ మైనింగ్ చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామంలో ఉన్న కొండను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. హిటాచీ, జెసీబీలను ఏర్పాటు చేసుకొని ఎర్రమట్టి, సిలికాన్ స్టోన్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. రాయల్టీ లేకుండా ప్రతి రోజు పెద్ద సైజ్ జెసీబీతో కొండకు గుండు కొడుతున్నారు. ఇప్పటికే సగం కొండ ఖాళీ అయ్యింది. రోజూ పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి. ఒక్కో టిప్పరు మట్టి ధర బయటి మార్కెట్లో రూ.4 వేలకు పైనే పలుకుతోంది. ఇదే సమయంలో అద్దాల తయారీలో వాడే సిలికాన్ స్టోన్‌ను అక్రమంగా జిల్లాను దాటిస్తున్నారు. టీడీపీ నాయకులు ప్రతి రోజు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నా అధికారులకు తెలియని విషయమనుకుంటే పొరపాటే. ఇదిలాఉంటే జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. రెండు నెలల వ్యవధిలో టీడీపీ నేతలు, వారి అనుచరులు జిల్లాలో అక్రమ మైనింగ్, ఇసుక ద్వారా రూ.లక్షలు ఆర్జిస్తుండటం గమనార్హం.

**టీడీపీ నేతల అక్రమాలకు సాక్ష్యాలివే..**

- **జూన్ 21:** ఆదోని మండలం దొడ్డణగేరి గ్రామంలో సర్వే నెంబర్ 188లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వుకుంటున్నారు. సమాచారం మేరకు మైనింగ్ అధికారులు ట్రాక్టర్, జెసీబీని సీజ్ చేశారు.
- **జూన్ 22:** కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో సర్వే నెంబర్ 396, 477లలో అక్రమంగా హిటాచీ, జేసీబిలతో కంకరను కొల్లగొడుతున్నారు. ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు తనిఖీలు చేసి జరిమానా విధించారు. ట్రాక్టర్లను సీజ్ చేశారు.
- **జూన్ 25:** కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. మైనింగ్ అధికారులు అక్రమ మైనింగ్‌ని నిలిపి వేసి జరిమానా విధించారు.
- **గత నెల 11:** కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో 603 సర్వే నెంబర్‌లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలను చేపట్టారు. స్పందించిన మైనింగ్ అధికారులు జరిమానా విధించారు.
- **గత నెల 23:** కర్నూలు రూరల్ మండలం పరిధిలోని రుద్రవరం గ్రామంలో సర్వే నెంబర్ 608లో అక్రమంగా 1900 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో మైనింగ్ అధికారులు జరిమానా విధించారు.
- **ఈనెల 1న:** గూడూరు మండలం కొత్తూరు గ్రామంలోని వక్కెర వాగు వద్ద అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. హిటాచీ, రెండు టిప్పర్లను సీజ్ చేసి నాగులాపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు.
- **ఈనెల 8న:** డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామంలో సర్వే నెంబర్ 285, 286, 288లలో అలాగే పెద్దమల్కాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 100లో అక్రమంగా మైనింగ్ చేపట్టారు. అనుమతులు లేకుండా డోలమైట్, మొజాయిక్ చిప్స్ తవ్వకాలను చేపడుతున్నారు.

**ఫిర్యాదులు వచ్చాయి**

తమ కార్యాలయానికి ఫిర్యాదులు వచ్చాయి. పూడిచెర్లలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌కు అనుమతులు లేవు. పనులు నిలిపివేయించి శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్, క్వారీ పనులు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవు.

– రాజశేఖర్, ఉప సంచాలకులు, జిల్లా మైనింగ్, భూగర్భ శాఖ


జేసీబీతో కొండను తొవ్వుతున్న దృశ్యం


టిప్పర్‌లో తరలుతున్న గ్రావెల్

## 'ఉరుకుంద'లో ఉప్పొంగిన భక్తిభావం



ప్రత్యేకాలంకరణలో ఈరన్న స్వామి మూలవిరాట్, ఆలయ ముంగిట సేద తీరుతున్న భక్తులు

మంత్రాలయం: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండో సోమవారం ఉరుకుంద ఈరన్న క్షేత్రానికి భక్తులు తండోపతండాలు తరలి వచ్చారు. ఆలయ నలుదిక్కుల్లో విడది చేశారు. స్థలం తక్కువగా ఉండటంతో కోసిగి రహదారిలోని కొండ, గుట్టలపైకి చేరుకోవాల్సి వచ్చింది. భక్తుల తాకిడితో ఆలయ దారులన్నీ కిటకిటలాడాయి. స్వామి దర్శన క్యూలైన్లు, లడ్డూ, పులిహోర , దర్శన, నిత్యాన్నదాన కౌంటర్లు కిక్కిరిసి కనిపించాయి. ప్రతి ఇంటిలో ఒకరైనా తలనీలాలు స్వామి సమర్పించడం ఆనవాయితీగా వస్తుండటంతో ప్రధాన కల్యాణ కట్టతోపాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రెండు కట్టల్లోనూ రద్దీ కనిపించింది. భక్తులు వేకువ జాము నుంచే ఆదోని రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువలో పుణ్యస్నానాలు ఆచరించారు. పిండివంటలతో నైవేద్యాలు చేసుకుని స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. రెండు లక్షల మందికి పైగా భక్తులు తరలిరావడంతో ఆది, సోమవారాలు నిర్విరామంగా దర్శనాలు కొనసాగించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ పి. గురుప్రసాద్ నేతృత్వంలో ఉత్సవాల ప్రత్యేకాధికారి పాండురంగా రెడ్డి, సూపరింటెండెంట్లు వెంకటేశ్వర రావు, మల్లికార్జున ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### 274 ఎకరాలకు పండ్ల మొక్కలు సరఫరా

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన కింద అమలు చేస్తున్న వాటర్‌షెడ్ గ్రామాల్లో 20,348 పండ్ల మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అదనపు పీడీ(వాటర్‌షెడ్స్) మాధవీలత తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 7 వాటర్‌షెడ్స్ ప్రాజెక్టులు ఉండగా.. 28 మైక్రో వాటర్‌షెడ్‌లు పనిచేస్తున్నాయన్నారు. వాటర్‌షెడ్ గ్రామాల్లో 274 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి సంబంధించి మొక్కలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లాలో 239 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 35 ఎకరాలకు పండ్ల మొక్కలు సరఫరా చేస్తామని, ఉపాధి హామీ పథకం కింద నిర్వహణ పనులు చేపడతామన్నారు. మొక్కల సరఫరాకు రూ.12 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు అదనపు పీడీ మాధవీలత సోమవారం విలేఖర్లకు తెలిపారు.

### ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించే కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ పద్మజ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు జిల్లా అధికారులందరూ 9.30 గంటలకే హాజరు కావాలన్నారు. సోమవారం అధికారులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయబోమని చెప్పారు. ప్రజా సమస్యలు నిర్ణీత గడువులోగా పరిష్కరించకపోవడం వల్లే గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయి దాటి అమరావతి గ్రీవెన్స్‌కు వెళ్తున్నారన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లా అధికారులు విజన్ లేకుండా వృథా నివేదికలు పంపడం తగదన్నారు. కార్యక్రమంలో 153 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.ఈ సమస్యలన్ని సత్వరమే పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేయండి...**

నంద్యాల పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో భారత స్వాతంత్ర్య దినోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, అవార్డుదారులకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్డీఓలను ఆదేశించారు. శకటాల ప్రదర్శన అర్థవంతంగా ఉండాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా నృత్య గీతాలాపన ఉండాలన్నారు. ఆహ్వాన పత్రికలన్నీ కూడా మంగళవారం సాయంత్రంలోగా పంపిణీ చేసేలా ఆర్డీఓలు, ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలన్నారు.

## తిరుత్తణి రోడ్డు ప్రమాదంలో పత్తికొండ విద్యార్థి మృతి


రామ్మోహన్‌రెడ్డి(ఫైల్)

తుగ్గలి(పత్తికొండ): తమిళనాడులోని తిరుత్తణి సమీపంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పత్తికొండకు చెందిన బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. అంబటి కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కూమారుడు ఉన్నా రు. కుమారుడు రామ్మోహన్‌రెడ్డి చెన్నై శివారులోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులు సెలవులు రావడంతో తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయానికి తన తోటి స్నేహితులతో కలిసి కారులో వెళ్లాడు. దర్శనానంతరం ఆదివారం తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తిరుత్తణికి సమీపంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో రామ్మోహన్‌రెడ్డితో పాటు మరో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. రామ్మోహన్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి స్వగ్రామం బనగానిపల్లె మండలం బత్తలూరు పాడు. వ్యాపార నిమిత్తం కొన్నేళ్ల క్రితం ఈయన పత్తికొండకు వచ్చారు.

# యువకుడి దారుణ హత్య

- గొంతుకోసి మట్టుబెట్టిన దుండగులు


హత్యకు గురైన వ్యక్తి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

పాణ్యం: స్థానిక తాటికాయ చెరువు సమీపంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం ఉదయం పొలాలకు వెళ్లే రైతులు కొండ బండపై రక్తపుమడుగులో ఉన్న యువకుడి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పాణ్యం సీఐ వంశీధర్, ఎస్ఐలు అశోక్, వెంకటసుబ్బయ్యలు ఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని పరిశీలించారు. గొంతు కోసి దారుణంగా చంపేసినట్లు తెలుస్తోంది. సంఘటన స్థలంలో ఆనవాళ్లను చూస్తే ఆదివారం హత్య జరిగి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. హంతకుల ఆధారాల కోసం జిల్లా క్రైమ్ పార్టీ పోలీసులు కొండ ప్రాంతాన్ని అడుగడుగునా గాలిస్తున్నారు. హతుడికి దాదాపు 25 ఏళ్ల వయస్సు ఉంటుందని, తెలుపు, నలుపు గళ్ల చొక్కా, ఖాకీ రంగు ప్యాంట్ ధరించాడని, పక్కనే దుస్తుల బ్యాగ్, తిని పడేసిన ఆహార పొట్లం పేపర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పాణ్యం హైవే నుంచి దాదాపుగా 2కిలో మీటర్ల దూరంలో ఈ దారుణం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## లెఫ్ట్.. ఓ గిఫ్ట్

- ఎడమ చేతివాటం అదృష్టంగా భావిస్తున్న వైనం
- ప్రపంచ మేధావుల్లో వారే అధికం
- వారిలో పనులు వేగంగా, సులభంగా చేసే శక్తి
- నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే

ఏదేనా పని ప్రారంభించేటప్పుడు కుడి చేతితో చెయ్యి, కుడికాలు పెట్టు.. అనడం సర్వ సాధారణం. శరీర అవయవాల్లో దేని ప్రాముఖ్యత దానిదే అయినా మనిషి జీవనం సాఫీగా సాగేందుకు ఎంతో ముఖ్యమైనవి కాళ్లు, చేతులు. చేసే పని ఒక్కటే అయినా ఒక్కొక్కరికీ ఒక్కో చేతితో చేయడం సౌలభ్యంగా ఉంటుంది. అయితే జనాభాలో 90 శాతం మంది కుడిచేతితో చేస్తే మిగిలిన పది శాతం ఎడమ చేతి వాటం. అందుకే వారు ప్రత్యేకం. శారీరకంగానో, మానసికంగానో వచ్చిన అలవాటు ఇప్పుడు కొందరు అదృష్టంగా భావిస్తున్నారు. నేడు వరల్డ్ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

దొర్నిపాడు: మనతోనే మనలానే ఉంటున్నా వారిదొక ప్రత్యేక శైలి.. అదే ఎడమచేతి వాటం (లెఫ్ట్ హ్యాండర్స్). ప్రపంచ జనాభాలో వారు కేవలం 10 శాతం మాత్రమే. అందుకే వీరు చాలా అరుదుగా కనిపిస్తుంటారు. వీరెక్కడ కనబడినా మనం ప్రత్యేకంగా చూడటంతో పాటు వారి గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటాం కూడా. కుడి ఎడమైతే పొరపాటేలేదోయ్ అన్నాడో సినీ కవి. వారు గొప్ప శక్తువంతులని ప్రముఖులు, మేధావులు కొనియాడుతుంటారు. కుడి చేతి వాటం వాళ్ల కన్నా ఎడమ చేతి వాటం ఉన్నవాళ్లు ఉన్నత స్థానాల్లో ఉంటారని, వారికి తెలివి తేటలు, గ్రహించే శక్తితో పాటు మంచి ఆలోచన శక్తి ఉంటుందని అంటారు. అంతేకాదు ప్రపంచంలో గుర్తింపు పొందిన మేధావుల్లో మన దేశ ప్రధాని మోదీ ఎడమ చేతితోనే రాస్తారు. క్రికెటర్లు సచిన్, యువరాజ్ సింగ్, అమెరికా మాజీ ప్రెసిడెంట్లు ఒబామా, బిల్‌క్లింటన్, సినీ నటుడు అమితాబ్, సావిత్రి ఇలా ఎందరో లెఫ్ట్‌హ్యాండ్ సైడ్ ఉన్నవారే. ఎడవ చేతి వాటం ఉన్న వారు ఆకర్షణీయంగా ఉంటారు. క్రియేటివిటీ, మ్యూజిక్, ఆర్ట్ గేయడం వంటివి అధికంగా ఉంటుంది. వీరికి మాట్లడే శక్తి, అర్థం చేసుకునే సామర్థ్యం మెండుగా ఉంటుంది.




**వీరి ప్రత్యేకతల్లో కొన్ని**

- చేతులకు ఉన్నట్లే కాళ్ల వాటం కూడా ఉంటుంది. కుడిచేతి వాటం ఉన్నవారిలో కుడికాలు వాడకం,ఎడమచేతి వాడకం ఉన్నావారు ఎడమ కాలి వాడకం ఎక్కువగా కనిపిస్తుంది. ఎడమ చేతివాటం ఉన్న వాళ్ల ఎదైనాచూడాలంటే మొదటఎడమ కన్నుతోనే చూస్తారు.
- అయితే మహిళలకు మాత్రం సృజనాత్మకతో పాటు మెదడు చురుగ్గా పనిచేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి
- ఎడమ చేతివాటం వారు వేగంగా, సులభంగా పనులు మంచి టెక్నిక్‌తో పూర్తి చేస్తారు.
- వీరికి మెమొరి పవర్, ఐక్యూ అధికంగా ఉన్నప్పటికీ చిన్న చిన్న విషయాలు వెంటనే మరచిపోగలరు
- టాప్ టెన్నీస్ క్రీడాకారుల్లో 40 శాతం ఎడమ చేతి వాటం వారు ఉండటం గమనార్హం.
- 26 మంది అమెరికా ప్రెసిడెంట్లలో 8వ మంది ఎడమచేతి వాటం వారే.
- 40 ఏళ్ల దాటిన మహిళలు గర్భం దాల్చితే పుట్టే పిల్లలో 128 శాతం ఎడమచేతివాటం వారే ఉన్నారట.

**వారిలో ఇబ్బందుల ఇలా..**

ఎడమ చేతి వాటం ఉన్న టైలర్లు కాస్తా ఇబ్బందులు పడుతుంటారు. ఎందుకంటే కత్తెర, సూయింగ్ మిషన్ డిజైన్ పూర్తిగా కుడి చేతి వారికి సరిపోయే విధంగా తయారు చేశారు. కంప్యూటర్ మౌస్, డ్రైవింగ్ చేసే వారు ఇలా ఎందరో. ప్రస్తుతం వారి కోసం కూడా ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు.

**అయినా.. ఆ చేతితోనే..**



- ఇక్కడ చిత్రంలో ఎడమచేతితో బ్యాడ్మింటన్ ఆడుతున్న వ్యక్తి దొర్నిపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు. ఈయనకు మొదటి నుంచి ఎడమ చేతి వాటమే అలవాటుగా మారింది. ఐదేళ్ల తర్వాత బడిలో చేరినప్పుడు బలవంతంగా టీచర్లు కుడిచేతిని అలవాటు చేశారట. కానీ ఎదైనా అందుకోమన్నప్పుడు, తనకై తాను పనిచేసేప్పుడు ఇప్పటికీ ఎడమ చేయి ముందుకు సాగుతుంది. ప్రస్తుతం ఉద్యోగ రీత్యా సంతకాలు, భోజనం, తీర్థప్రసాదాలు మాత్రం కుడి చేత్తో చేసి మిగతా కార్యక్రమాలు అన్నీ ఎడమ చేతితోనే చేస్తున్నారు. కూతురు స్వాతికి కూడా ఎడమ చేతి వాటమే వచ్చిందని చెబుతున్నారు.

**అక్కాచెల్లెళ్లు.. అదుర్స్**



- ఇక్కడ చిత్రంలో కపిస్తున్న బాలికలు ఇద్దరు అక్కాచెల్లెలు. షాజిదాబి ఇంటర్, రిజ్వాన 5వ తరగతి చదువుతున్నారు. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన హుసేన్‌బాషా, ఉసేన్‌బీల కూతుళ్ల ఇద్దరు ఎడమచేతి వాటం వారే కావడం విశేషం. అంతేగాక వీరు చదువులో అందరికంటే ముందంజలో ఉంటుంది. తెలుగు, అంగ్లం కంటే హిందీని రైటింగ్ చాలా బాగా రాస్తారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**బలవంతంగా మానిపించకూడదు**



ఎడమ చేతిని ఉపయోగిస్తే మంచిది కాదని పెద్దలు ఇప్పటికీ చెబుతుంటారు. ఈక్రమంలో పిల్లలకు అలవడిన ఎడమ చేతి అలవాటను బలవంతంగా మాన్పించే ప్రయత్నం చేస్తారు. అలా చేయకూడదు. మనిషి మెదడు కుడి, ఎడమ రెండు అర్ధభాగాలుగా ఉంటుంది. కుడి వైపు ఉన్న మెదడు ఎడమవైపు ఉండే శరీర భాగాల్ని నియంత్రిస్తుందని పరిశోధనల్లో తేలింది. అంటే కుడి అర్ధ భాగం బలంగా ఉన్నవారిలో ఎడమ చేతివాటం వస్తుంది.

– డాక్టర్ భార్గవి (పీహెచ్‌సీ), దబ్ల్యూ.కొత్తపల్లె